# సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 18 । జనవరి । 2023




**రాజన్నకు మొక్కులు**

వేములవాడ: రాజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది స్వామివారిని దర్శించుకున్నారు. అధికారులు భక్తుల ఏర్పాట్లు పరిశీలించారు.



**పోచమ్మకు బోనం**

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మ ప్రాంతం రద్దీగా మారింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.0/15.0

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ పార్టీ బలోపేతానికి బూత్ కమిటీ సభ్యులు, బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో మంగళవారం శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి అందే విధంగా చూడాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, అసెంబ్లీ కన్వీనర్‌లు మల్లారెడ్డి, రవీందర్, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### 317 జీవోతో బదిలీలు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు బదిలీ చేపడతామన్న సందర్భంగా జీవో నంబరు 317 ద్వారా బదిలీలు చేపట్టి, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవోల భాగంగా ఉపాధ్యాయులను నూతన జిల్లాలకు బదిలీ చేసి, ఖాళీ ఉన్న పోస్టులను మాత్రం చూపించలేదన్నారు. పాఠశాలల కేటాయింపు సమయంలో పాత స్టేషన్ పాయింట్లను పరిగణించకుండా కేవలం సర్వీస్ సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. 317జీవోతో ఉపాధ్యాయులకు పాత స్కూల్ స్టేషన్ పాయింట్లను ఇస్తూ బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాని కోరారు.

### ఫలించిన చర్చలు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆర్డర్ తీన్‌తార్ వస్త్రానికి కూలిపెంచే విషయంలో మంగళవారం పాలిస్టర్ యజమానులు, సీఐటీయూ, ఆసాముల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. తీన్ తార్ వస్త్రానికి పవర్‌లూమ్ కార్మికులకు మీటర్‌కు రూ.2.75పైసలు, ఆసాములకు మీటర్‌కి రూ. 6.25పైసలు కూలీ పెంచుతున్నట్లు ఒప్పందం చేశారు. ఆసాములకు రావాల్సిన డాబీ, పింజర డబ్బులను వచ్చే విధంగా చూస్తామని, పవర్‌లూమ్ కార్మికులకు 10శాతరం యారన్ సబ్సిడీని 15రోజుల్లోగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిందం చక్రపాణి, మంచె శ్రీనివాస్, మండల సత్యం, యెల్దండి దేవదాస్, గోవిందు రవి, దూడం శంకర్,రమణ, గుండు రమేశ్, మునీందర్, మూషం రమేశ్, తదితరులు ఉన్నారు.

### ఉచిత శిక్షణకు ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: గ్రూప్–2,3,4 పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కొనసాగే ఆన్‌లైన్ ఫౌండేషన్ కోర్సులో చేరే ఆసక్తి గల ఎస్సీ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణార్థుల అర్హతల వివరాలను ఎస్సీ అభివృద్ధి అధికారి భాస్కర్‌రెడ్డి వివరించారు. ఏదేని జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై వార్షికాదాయం ఏడాదికి మూడు లక్షలకు మించని కుటుంబాలకు చెందిన వారై ఉండాలన్నారు. వచ్చే నెల 6 నుంచి బైపాస్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్‌భవన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 95156 22390 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.

# పర్యాటకం.. ఇంకెంత దూరం?

## రాజన్న సిరిసిల్ల టూరిజం హబ్‌గా ఏర్పాటు అయ్యేది ఎప్పుడో..!

- జిల్లాకు దరి చేరని పర్యాటక శోభ
- ప్రతిపాదనల్లోనే అభివృద్ధి పనులు
- స్థానికంగా అద్భుతమైన నీటి ప్రాజెక్టులు
- రామప్పగుట్టల్లో పాపికొండల అందాలు



నాంపల్లి గుట్టపై కాళీయమర్ధనం

సిరిసిల్ల: 'రాజన్న సిరిసిల్ల జిల్లాను టూరిజం హబ్‌గా మార్చుతాం. వేములవాడకు వచ్చే భక్తులకు మంచి వసతులతో కూడిన పర్యాటక కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం. ఇక్కడి మన పిల్లలకు ఉపాధి అవకాశాలు ఉంటాయి. తెలంగాణ టూరిజంశాఖ జిల్లాలో అన్ని వసతులు కల్పిస్తుంది'.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 2021 జూలై 4న రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడారు. సీఎం హామీతో సిరిసిల్లకు పర్యాటక శోభ వస్తుందనే ఆశలు చిగురించాయి. కానీ ఏడాదిన్నరగా పర్యాటక రంగ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన అన్ని హంగులూ ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ఆహ్లాదాన్ని దూరం చేస్తోంది.

### అగ్రస్థానంలో ఎములాడ రాజన్న



వేములవాడ రాజన్న ఆలయం

- దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం పర్యాటకులను ఆకట్టుకోవడంలో అగ్రస్థానంలో ఉంది. ఏటా కోటి మంది భక్తులు రాజన్నను దర్శించుకుంటున్నారు. పక్కనే ఉన్న నాంపల్లి గుట్టపైకి వెళ్తారు. అక్కడి నుంచి కనిపించే మధ్యమానేరు జలాశయం అందాలను వీక్షించడంతో పాటు, మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో విహరించే విధంగా తెలంగాణ టూరిజం శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాజన్నను దర్శించుకుని వెళ్లే భక్తులు మధ్యమానేరు అందాలను వీక్షించే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని రామప్ప నుంచి మధ్యమానేరులో విహరించే అవకాశం ఉంది. వీటికి క్షేత్రస్థాయిలో చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

### సిరిసిల్లలో లాంచీ వసతి



మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో పర్యాటక శాఖ లాంచీ

సిరిసిల్ల జిల్లాకేంద్రాన్ని తాకిన మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో ఇప్పటికే తెలంగాణ టూరిజం వారు లాంచీని ఏర్పాటు చేశారు. మానేరు కరకట్ట నుంచి రామప్ప గుట్టల మధ్య మీదుగా మధ్యమానేరు జలాశయం వరకు బోటింగ్ వసతి కల్పించాలని భావిస్తున్నారు. నిజానికి పాపికొండల అందాలు రామప్పగుట్టల్లో కనిపించడం విశేషం. సిరిసిల్ల కలెక్టరేట్ సమీపంలో హరిత హోటల్ భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ గతంలో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. సిరిసిల్ల పట్టణంలో కొత్త చెరువును ఆధునీకరించారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పరిశ్రమలను పరిశీలించడంతో పాటు మధ్యమానేరు బ్యాక్ వాటర్ 12 కిలో మీటర్ల మేరకు లాంచీలో వెళ్లి వచ్చే అవకాశం ఉంది. కానీ ఇప్పటి వరకు పర్యాటక శాఖ వద్దనే ప్రతిపాదనలు ఉండగా.. క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు.

### అందాల 'అన్నపూర్ణ'



అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులో ప్రకృతి అందాలు

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్‌లో సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు ఉన్నాయి. జలాశయం మధ్యలో గుట్టపై 40 ఎకరాల స్థలం ఉండడంతో ఐలాండ్‌గా లక్నవరం తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎప్పటికీ నిండుగా ఉండే అన్నపూర్ణ ప్రాజెక్టును, అక్కడే ఉండే పాచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ప్రతిపాదలు ఉన్నాయి.

### ఎగువ మానేరు..

గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు నిండా నీటితో మత్తళ్లు పరవళ్లు తొక్కుతుండగా.. ఇప్పటికే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎగువ మానేరులోని బోటింగ్ వసతి ఏర్పాటు చేసి పర్యాటకంగా వృద్ధి చేస్తున్నారు. సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం ఆరు మత్తళ్లు వినూత్నంగా ఉన్నాయి. మొత్తంగా జిల్లాలోని రిజర్వాయర్లను, ప్రకృతి సహజమైన గుట్టలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని హంగులు ఉన్నాయి. కానీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ప్రతిపాదనలకు మోక్షం లభిస్తే పర్యాటక రంగ అభివృద్ధి సాధ్యమవుతుంది. సిరిసిల్లలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు జిల్లాను టూరిజం హబ్‌గా మార్చితే బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి.

# 9వ ప్యాకేజీ పనుల్లో వేగం పెంచండి

- సీపేజీలను గుర్తించి పనులు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- మల్కపేట సొరంగం, సర్జిపూల్ సందర్శన



అండర్ టన్నెల్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, తదితరులు

సిరిసిల్ల/కోనరావుపేట: జిల్లాలో చేపట్టిన కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని, షిఫ్ట్‌వారీగా 24 గంటలు పనులు చేయించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కోనరావుపేట మండలం మల్క పేట వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనులను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరంగా పనులు పూర్తి చేసి మల్కపేట రిజర్వాయర్‌ను నీటితో నింపాలన్నారు. ఎక్కడైనా సీపేజీ ఉంటే గుర్తించాలని అన్నారు. కంట్రోల్ రూం నుంచి సబ్ స్టేషన్ వరకు అనుసంధాన పనులు పూర్తి చేయాలని సూచి ంచారు. ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు ప్రాజెక్టు ప్రోగ్రెస్ రిపోర్టును కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సొరంగంలో తిరిగి, సర్జిపూల్, లైనింగ్ పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, ప్రాజెక్టు ఎస్ఈ సుధాకర్ రెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, కోనరావుపేట తహసీల్దార్ నరేందర్, ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.

**కంటి వెలుగును వినియోగించుకోవాలి**

ఈ నెల 19 నుంచి నిర్వహించే కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కోనరావుపేట పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన డ్రైరన్‌ను పరిశీలించారు. జిల్లాలో 26 బృందాలతో క్యాంపులు ఏర్పాటుచేశామని తెలిపారు. 18ఏళ్లు పైబడిన 4,22,182మందికి పరీక్షలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, మొబైల్‌ఫోన్ తప్పనిసరిగా తెచ్చుకుని పరీక్షలు చేయించుకోవాలన్నారు.

**పంచాయతీ సిబ్బందికి అభినందన**

కోనరావుపేట గ్రామపంచాయతీ కంపోస్టు షెడ్ ద్వారా తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు విక్రయిస్తున్నామని గ్రామ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కంపోస్టు ఎరువులు తయారు చేయడంవల్ల గ్రామపంచాయతీకి ఆదాయం వస్తుందని కలెక్టర్ అభినందించారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్ ఉన్నారు.

**రోడ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న రోడ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్లు, భవనాలశాఖ అధికారులతో సమీక్షించారు. రగుడు నుంచి ఎల్లమ్మ జంక్షన్ వరకు బైపాస్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రెండో బైపాస్ పనుల్లో వేగం పెంచి ఫిబ్రవరి మొదటి వారంలోగా పూర్తి చేయాలన్నారు. రగుడు నుంచి వేములవాడ నంది కమాన్ వరకు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి, మరో లేయర్ బీటీ వేయాలని ఆదేశించారు. మహాశివ రాత్రి జాతర నేపథ్యంలో వేములవాడను కలిపే అన్ని రోడ్లను పూర్తి చేయాలని, మూలవాగుపై వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు.

## వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌దే విజయం



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): వచ్చే ఏ ఎన్నికల్లోనైనా బీఆర్‌ఎస్‌దే విజయం ఉంటుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సెస్ గంభీరావుపేట మండల డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన గొరిసేని నారాయణరావు సెస్‌కార్యాలయ ఆవరణలో మంగళవారం వినియోగదారులకు, రైతులకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితో సిరిసిల్ల సెస్ పీఠం కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలోనే గంభీరావుపేట అభ్యర్థి అత్యధిక మెజార్టీ సాధించడం సంతోషకరమన్నారు. సభ అనంతరం నారాయణరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీలు కె.విజయ, గుండం నర్సయ్య, లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు భూపతి సురేందర్, గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా ఉండాలి

- కంటి వెలుగును విజయవంతం చేయాలి
- మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అరుణ, అధికారులు

సిరిసిల్ల: జిల్లాను అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ముందువరుసలో ఉంచాలని, ప్రజలకు మరింత చేరువై ఆదర్శంగా నిలువాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జెడ్పీ ఆఫీస్‌లో మంగళవారం జెడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. అరుణ మాట్లాడుతూ స్వచ్ఛసర్వేక్షణ్‌లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిందని, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలన్నారు. జిల్లాలో రెండో విడత 'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ.. ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

**పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి**

జిల్లాలో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాలని అరుణ వివరించారు. ప్రభుత్వ సబ్సిడీని అర్హులకు అందించి పాడి యూనిట్లను పూర్తిస్థాయిలో నెలకొల్పాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రతివారం తమ మండలంలోని అన్ని గ్రామాలు తిరిగేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. తద్వారా నీటి సరఫరాలో సమస్యలు తెలుస్తాయని, వాటికి పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

**మినీ ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు స్థాపించాలి**

జిల్లాలో మినీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం 35శాతం రాయితీ అందిస్తుందని, వ్యక్తులు గానీ, సమూహాలుగా గానీ, పాక్స్ ద్వారా గాని యూనిట్‌లను స్థాపించుకోవచ్చని అరుణ తెలిపారు. వ్యవసాయంలో మార్పులకు శ్రీకారం చుడుతూ పంట మార్పిడిపై దృష్టి సారించాలని, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలని అన్నారు. దళితబంధు పథకం ద్వారా దళితుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం భారీ ఆర్థికసాయం అందిస్తోందని అన్నారు. 'మన ఊరు–మన బడి' అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జెడ్పీ చైర్ పర్సన్ అరుణ అధ్యక్షత వహించగా, వ్యవసాయంపై వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమంపై తంగళ్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాణి మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు కత్తెరపాక ఉమ అధ్యక్షత వహించారు. జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం కుమార్, మ్యాకల రవి, చీటీ లక్ష్మణ్‌రావు, కొమిరిశెట్టి విజయ, ఏస వాణి, గుండం నర్సయ్య, గుగులోత్ కళావతి, జెడ్పీ కో– ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, అహ్మద్ , తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే వాహనాలు సీజ్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

- ప్రతీ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు ఉండాలి
- ఎస్పీ రాహుల్ హెగ్డే

సిరిసిల్లక్రైం: వాహన చట్టాన్ని అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేయాలని, ప్రతి కేసులో సమర్థవంతమైన దర్యాప్తు జరగాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులు, నిందితులకు శిక్ష పడేందుకు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా త్వరగా చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ఎస్సీఎస్టీ, కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోక్సో యాక్ట్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలని, నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, స్టిక్కర్లు వేయడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్ తీసేసి సౌండ్ పొల్యూషన్ వంటివి చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రత కల్పించాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్‌ను పటిష్టంగా అమలుపరుస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18మందికి ప్రశంసాపత్రాలు అందించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి, డీసీఆర్బీ డీఎస్పీ బాలక్రిష్ణ, సీఐలు అనిల్ కుమార్, ఉపేందర్, మొగిలి, వెంకటేశ్, బన్సీలాల్, కిరణ్, మధుకర్, ఆర్ఐలు కుమారస్వామి యాదగిరి, ఎస్సైలు పాల్గొన్నారు.

# పట్నం పోయేది ఎట్లా?

- ముగిసిన సెలవులు.. దొరకని బస్సులు
- సిరిసిల్ల వాసులకు హైదరా'బాధలు'
- సీట్లు లభించక విద్యార్థులు, ప్రయాణికుల పాట్లు
- నేడు సగం బస్సులు సీఎం సభకే



ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



హైదరాబాద్ వెళ్లే బస్సు వద్ద రద్దీ

| సిరిసిల్ల బస్సు డిపో స్వరూపం | |
|---|---|
| మొత్తం బస్సులు | 66 |
| ఆర్టీసీ బస్సులు | 35 |
| అద్దె బస్సులు | 31 |
| రూట్లు | 17 |
| సిబ్బంది | 271 |

సిరిసిల్లకల్చరల్: విద్యా సంస్థలకు ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులు ముగిశాయి. ఇంటర్ కళాశాలలు మంగళవారం ప్రారంభం కాగా.. పాఠశాలలు, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలలు బుధవారం నుంచి తెరుచుకోనున్నాయి. ఆయా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, తదితరులు సిరిసిల్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు నానా తిప్పలు పడుతున్నారు. మంగళవారం సీట్లు దొరక్క బస్సులన్నీ కిక్కిరిసిపోగా.. డిపోకు చెందిన సగం బస్సులు సీఎం సభ కోసం కేటాయించడంతో బుధవారం ప్రయాణం కష్టతరం కానుంది.

**బస్సులు లేక.. సీట్లు దొరక్క**

రవాణా వ్యవస్థను ప్రోత్సహించి ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ బస్సుల సేవల్లో లోపం జిల్లా ప్రజలకు శాపంగా మారుతోంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్టీసీ అధికారుల తీరుతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. సాక్షాత్తు మంత్రి కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఆర్టీసీ సేవల్లో లోపం ప్రయాణికులతోపాటు విద్యార్థుల ఇబ్బందులకూ కారణమవుతోంది. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు మంగళవారం చుక్కలు కనిపించాయి. ఇక్కడి ఉంచి నేరుగా జేబీఎస్ వెళ్లేందుకు బస్ లేదు. వేములవాడలోనే బస్సులో సీట్లు అన్నీ నిండిపోయి రావడంతో సిరిసిల్ల ప్రయాణికులు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి కనిపించింది. కొందరైతే వేములవాడ వెళ్లి అక్కడి నుంచి సీట్లు ఆపుకుని సిరిసిల్లకు వచ్చారు.

**హైదరా'బాధ'లే**

సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులకు సిరిసిల్ల పాత బస్టాండ్‌లో కనీసం నిలువ నీడ లేదు. బస్సు వచ్చే వరకూ నిలబడాల్సిందే. ఎండలో నిరీక్షించాల్సిందే. ప్రయాణికుల కోసం అక్కడక్కడా వేసిన సిమెంట్ బెంచీలు కూడా పూర్తిగా ఎండలోనే ఉంటాయి. ఆ బెంచీ అయినా దక్కించుకోవాలంటే అడ్డుగోడలా ఉన్న వాహనాలను దాటుకుంటూ వెళ్లాలి. మహిళలు, విద్యార్థినులు ప్రధానంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రైవేట్ వాహనాల పార్కింగ్**

నిబంధనల ప్రకారం ఆర్టీసీ ప్రాంగణాల్లోకి ప్రైవేట్ వాహనాల ప్రవేశానికి అనుమతి ఉండదు. ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించే అవకాశం ఉంది. పాత బస్టాండ్ పరిసరాల్లో మొత్తం ద్విచక్ర వాహనాలతోనే నిండిపోయి ఉంటుంది. అడిగేవారు ఉండరు. వివిధ పనుల నిమిత్తం కరీంనగర్ వెళ్లే వాళ్లు తిరిగి వచ్చే వరకు అక్కడే తమ వాహనాలకు పార్కింగ్ చేస్తూ ఉంటారు. దీంతో బస్సుల కోసం నిరీక్షించేవారికి పాట్లు తప్పడం లేదు.

**సగం బస్సులు సీఎం సభకే...**

ఖమ్మం జిల్లాలో బుధవారం రోజున బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను విరివిగా వినియోగిస్తున్నారు. సిరిసిల్ల నుంచి సుమారు 30బస్సులను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. డిపోలో ఉన్న బస్సులే 66. అయితే వీటిలో సగం బస్సులను ఖమ్మం పంపిస్తున్నారు. దీంతో బుధవారం దూర ప్రాంతాలకు వెళ్లదల్చుకున్న ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయం చూపాలని పలువురు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మిడ్ మానేరును సందర్శిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి: అదనపు టీఎంసీ కోసం తవ్వుతున్న కాల్వ నుంచి తీస్తున్న మట్టిని మిడ్ మానేరు ప్రాజెక్టులో పోస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ బృందం మిడ్ మానేరును సందర్శించారు. ఆయన మట్లాడుతూ అదనపు టీఎంసీ కోసం కాల్వను తవ్వుతుండగా అందులో తీసిన మట్టిని వేరే చోటుకు తరలించకుండా మిడ్ మానేరులో పోస్తున్నారన్నారు. దీని వల్ల మిడ్‌మానేరు నీటి స్టోరేజ్ సామర్థ్యం తగ్గుతుందన్నారు. సదురు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసకోవాలన్నారు. నాయకులు మంచికట్ల రమేశ్, సోమ గంగరాజు, లచ్చయ్య, బుర్ర మల్లేశంగౌడ్ ఉన్నారు.

### కంటివెలుగుకు ఏర్పాట్లు

చందుర్తి(వేములవాడ): రెండో విడత కంటివెలుగు ఏర్పాట్లును చందుర్తిలోని రైతువేదికలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. కంటి పరీక్షలు చేసిన తరువాత అవసరమైన వారికి అద్దాలు, శస్త్ర చికిత్సలు, మందులు అందజేస్తామని అన్నారు. తహసీల్దార్ ఎండీ.మజీద్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్ కుమార్, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

### ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ..ఎల్లారెడ్డిపేట శివారులో వాహన తనిఖీ నిర్వహించగా ముగ్గురు మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుపడడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్ రావు, సిబ్బంది ఉన్నారు.

# ఉపాధికి 'ఆధారం' ఉండాల్సిందే!

- ఆధార్ కార్డు లింక్ చేయడం తప్పనిసరి
- జిల్లావ్యాప్తంగా 1.15 లక్షల జాబ్ కార్డులు
- ఆధార్ అప్డేట్ చేస్తేనే కూలి డబ్బులు ఖాతాల్లో
- ఇప్పటి వరకు 56శాతం ఆధార్ సీడింగ్ పూర్తి



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధికూలీలు తమ జాబ్‌కార్డులతో తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ కార్డుతో జాబ్ కార్డు అనుసంధానం జరిగితేనే ఉపాధికూలీ డబ్బులు వారి ఖాతాల్లో జమవుతాయని లేని పక్షంలో కూలి డబ్బులు పొందలేరని పేర్కొంటున్నారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో అనర్హులను ఏరివేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 శాతం మేర ఆధార్ సీడింగ్ జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**లక్షా 15వేల యాక్టీవ్ జాబ్ కార్డులు**

జిల్లాలోని 13మండలాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 1,15,733 మంది ఉపాది పొందుతున్నారు. వారిలో ఇప్పటికే 98.91 శాతం ఉపాధి కూలీల ఆధార్ కార్డులను సేకరించినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. వాటిలో 56.37 శాతం అంటే 65,242 జాబ్ కార్డులు విజయవంతంగా ఆధార్ అనుసంధానం జరిగాయి. ఇంకా 50,491 జాబ్ కార్డులు ఆధార్ అనుసందానం జరగాల్సి ఉంది. అయితే యాక్టీవ్, ఇనాక్టీవ్ జాబ్ కార్డుల సంఖ్య జిల్లా వ్యాప్తంగా 2,14,671 గా ఉంది.

**ముందంజలోరుద్రంగి, వేములవాడ రూరల్**

ఉపాధిహామీ కూలీల జాబ్‌కార్డులు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసే ప్రక్రియలో జిల్లాలో వేములవాడ రూరల్, రుద్రంగి మండలాలు ముందు వరుసలో నిలిచాయి. ఈ రెండు మండలాల్లో ఒక్కో మండలానికి కేవలం 3 చొప్పున మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. కాగా ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాలు వెనకబడ్డాయి. ఇదిలా ఉండగా ఆధార్ సీడింగ్ చేసినప్పటికీ అప్రూవ్ కొరకు గంభీరావుపేట 8814, కోనరావుపేట 5994, చందుర్తి 5934, తంగళ్లపల్లి 5730, ఎల్లారెడ్డిపేట 5164 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### ఆధార్ కార్డులు సేకరించాం



ఉపాధిహామీ కూలీల నుంచి వారి ఆధార్ కార్డులు సేకరించి టెక్నికల్ అసిస్టెంట్లకు అందజేస్తున్నాం.. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆధార్ కార్డుల సేకరణ పూర్తవుతుంది. తప్పనిసరిగా ఇవ్వాలని కూలీలకు అవగాహన కల్పించాం.

– శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ తంగళ్లపల్లి

### పెండింగ్ లేకుండా చూస్తాం



ఆన్‌లైన్ ద్వారా ఆధార్ కార్డు, జాబ్ కార్డు అనుసంధానం చేయాల్సి ఉంది. సేకరించిన ఉపాధిహామీ కూలీల జాబ్ కార్డుల సంఖ్యతో ఆధార్ కార్డు వివరాలను సరిచూసి సీడింగ్ చేస్తున్నాం. గడువులోపుగా పెండింగ్ లేకుండా పూర్తి చేస్తాం.

– రాపోల నాగరాజు, ఏపీవో తంగళ్లపల్లి

### 100 శాతం పూర్తి చేస్తాం



ఉపాదిహామి జాబ్ కార్డులతో కూలీల ఆధార్ కార్డు అనుసంధానం ఇప్పటికే 56 శాతం వరకు పూర్తయ్యింది. మరో 44 శాతం చేయాల్సి ఉండగా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం. 100 శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేస్తాం.

– సిహెచ్.మదన్ మోహన్, అడిషనల్ డీఆర్డీవో సిరిసిల్ల

# జిల్లాలో కంటి వెలుగు డ్రైరన్

- 26 ప్రాంతాల్లో నేత్ర పరీక్షలు
- రేపటి నుంచి జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం



ఇల్లంతకుంటలో డ్రైరన్ కంటి వెలుగు పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం కంటి వెలుగు డ్రై రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు జిల్లాలోని 26 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కంటి వెలుగులో భాగంగా డ్రై రన్ కంటి పరీక్షలను చేశారు. కోనరావుపేట మండలంలో డ్రై రన్ కంటి పరీక్షలను కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా కంటి వెలుగు డ్రైరన్‌ను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ చందుర్తిలో పరిశీలించారు. జిల్లాలో కంటి వెలుగును గురువారం నుంచి ప్రారంభిస్తున్నారు. తొలి రోజు 26 కేంద్రాల్లో కంటి పరీక్షలు చేస్తారు. జిల్లాలోని తంగళ్లపల్లి, నేరెళ్ల, చీర్లవంచ, ఇల్లంతకుంట, ఆరెపల్లి, కొదురుపాక, విలాసాగర్, బోయినపల్లి, అనుపురం, వేములవాడలోని వార్డు 10, వార్డు 20, హన్మాజీపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, నిమ్మపల్లి, గంభీరావుపేట, లింగన్నపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, హరిదాస్‌నగర్, ముస్తాబాద్, గూడెం, సిరిసిల్లలో వార్డు 10, వార్డు 25, వార్డు 30లో కంటిపరీక్షలను చేయనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా టేబుల్ నంబరు-1 వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. రెండో టేబుల్ వద్ద కంటి చూపును పరీక్షిస్తారు. మూడో టేబుల్ దగ్గర డాక్టర్ పరిశీలిస్తారు. కంటి సమస్యలను గుర్తించి మందులు ఇవ్వడం లేదా.. ఇతర సూచనలు డాక్టర్ చేస్తారని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు. జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని మంగళవారం డ్రై రన్ విజయవంతమైందని తెలిపారు. గురువారం నుంచి జిల్లాలో కంటి పరీక్షలు చేస్తామని ఆయన వెల్లడించారు.

# బహుజనున్ని సీఎం చేసేదాక నిద్రపోను



మాట్లాడుతున్న ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్

బోయినపల్లి(చొప్పదండి): 'తెలంగాణలో బహుజనున్ని సీఎం చేసి ప్రగతిభవన్‌లో కూచోబెట్టేదాక నిద్రపోను. ప్రాణాలకు తెగించి గ్రామాల్లో బీఎస్పీ జెండా గద్దెలు కడుతున్నారు.. మీ మీద ఈగ వాలినా లక్షమందితో వచ్చి గ్రామాల్లో కూర్చుంటా' అంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బోయినపల్లి మండలం తడగొండ, కోరెం, స్తంభంపల్లి, బోయినపల్లి గ్రామంలో బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం ఫామ్‌హౌస్ కోసం నిర్మించారని ఆరోపించారు. కొండ పోచమ్మ ప్రాజెక్టు ద్వారా నీరు తెచ్చుకోవడానికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. గ్రామాల్లో దళితబంధు, కల్యాణలక్ష్మి రాదని భయపెడున్నారని ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం మండలకేంద్రంలో బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంకని బాబు, దెడ్డె సమ్మయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు మాంకాళి తిరుపతి, అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్, పెగ్గెర్ల మహేందర్, రవీందర్, మహిళా జోనల్ కన్వీనర్, స్వరూప, అనూష, కరీంనగర అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, మహేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరిలో ఉత్సవాలు



మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని గ్రామదేవతలైన కట్టమైసమ్మ, దుర్గామాతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్ని కులసంఘాల ప్రతినిధులు మంగళవారం తీర్మానించారు. ఎల్లారెడ్డిపేటలోని మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయా కుల సంఘాల ప్రతినిధులు వచ్చే నెల ఫిబ్రవరి 8,9,10 తేదీలల్లో గ్రామదేవతల ప్రతిష్ఠ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించే లష్కర్ బోనాలను తలపించే విధంగా అమ్మవార్ల ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి కులసంఘం నుంచి 50 బోనాలను తీయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానిస్తామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, పట్టణ అధ్యక్షులు బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు,కుల సంఘాల ప్రతినిధులున్నారు.

# కారు నంబరు 3911?

- ఏటీఎం దొంగలు ఉపయోగించిన వాహనం
- ఢిల్లీ పాసింగ్ కారుగా గుర్తింపు
- మహారాష్ట్రలో ఉన్నట్లు సమాచారం
- కర్ణాటక గ్యాంగ్‌పై సందేహాలు
- లోతుగా సాగుతున్న పోలీసుల దర్యాప్తు

కోరుట్ల: సంచలనం రేపిన కోరుట్ల ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసులో దొంగలు ఉపయోగించిన కారును పోలీసులు గుర్తించినట్లు సమాచారం. చోరీ సమయంలో కారును పోలీసు జీపుతో ఢీకొట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగలు మాత్రం తప్పించుకుపోయారు. పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులు చోరీకి తెగబడక ముందు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కారులో తిరిగినట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే కార్గిల్ చౌరస్తా వద్ద 3911 నంబరు గల కారు అనుమానాస్పదంగా కనిపించింది. చివరకు అదే నంబరు కారులో ముష్కరులు ఏటీఎం చోరీకి వచ్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇది ఢిల్లీ పాసింగ్ కారుగా తెలిసింది. ఏటీఎం చోరీ చివరి నిముషంలో పోలీసుల నుంచి తప్పించుకున్న దొంగలు.. మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా మల్లాపూర్ రూట్‌లో వెళ్లి గోధూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం మీదుగా నాగ్‌పూర్ జాతీయ రహదారిపైకి వెళ్లి నిర్మల్ ఎదుట ఉన్న సోన్ వంతెన నుంచి ఆదిలాబాద్ చేరుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎం చోరీకి పాల్పడ్డ అగంతకులు కర్ణాటకకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. కారు ఆచూకీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట ప్రాంతంలో ఏటీఎం చోరీ జరిగిన విషయం విదితమే.

### పొలంలోనే గుండెపోటుతో రైతు మృతి

కోనరావుపేట: పొలంలో పనిచేస్తుండగానే గుండెపోటు రావడంతో రైతు హఠాన్మరణం చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం... కోనరావుపేట మండలం మంగళ్లపల్లికి చెందిన ఉప్పుల మల్లేశం(55) మంగళవారం పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో అక్కడే పడిపోయాడు. గమనించి కుటుంబసభ్యులు వెంటనే వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య భూలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు రేణ, రేవతి ఉన్నారు.



### దాడి కేసులో ఏడుగురి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ శివారులో ఈ నెల 15న రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు భూవివాదంలో కర్రలు, రాడ్లు, గొడ్డళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురిని రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ వివరించారు. అంకుశాపూర్ గ్రామానికి చెందిన జడల శ్రీధర్, జడల అలియాస్ జీల శేఖర్, చందు, సంజీవ్, లచ్చయ్య, శ్రీకాంత్, కైలాసంలపై హత్యాయత్నం అభియోగంపై విచారణ చేసి కోర్టు ఎదుట రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

### కారును ఢీకొట్టిన టిప్పర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల– కరీంనగర్ ప్రధాన రహదారిపై రగుడు జంక్షన్‌కి సమీపంలో మంగళవారం కారును ఓ టిప్పర్ ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారును కాంక్రిట్ మిక్సర్ టిప్పర్ ఢీకొట్టింది. కారు పాక్షికంగా దెబ్బతినగా, ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లికి చెందిన వివాహిత మంగళవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 15వ వార్డు హన్మక్కపల్లికి చెందిన పాత్తూరి సుమలత(32) కుటుంబ కలహాలతో ఇంట్లోనే ఉరి వేసుకున్నట్లు తెలిపారు. భర్త మహేశ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తండ్రి నూకలమర్రికి చెందిన గసికంటి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ సీఐ వెంకటేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు



గడువు ముగిసిన కూల్‌డ్రింక్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లోని ఓ దుకాణంలో గడువు తేదీ ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు చేశారు. పోతుగల్‌కు చెందిన కోల కృష్ణ దుకాణంలో రెండు కూల్‌డ్రింక్స్ మంగళవారం కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లాక బాటిళ్లపై ఈ నెలతోనే ఎక్స్‌పైరీ డేట్ ఉండడంతో ఖంగుతిన్నాడు. బాటిళ్ల ఓపెన్ చేసి వాటిని తాగక ముందే గడువు తేదీ చూడడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నాడు. ముస్తాబాద్‌లోని పలు దుకాణాలలో గడువు మీరిన కూల్‌డ్రింక్స్‌ను యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు.

### శ్రీధర్‌కు ఐకాన్ అవార్డు





అవార్డుతో శ్రీధర్‌చారి

సిరిసిల్లటౌన్: లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవింద్రబారతీలో స్వామి వివేకానంద 161 జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖులకు జాతీయ స్థాయి వివేకానంద ఐకాన్ అవార్డులను అందజేశారు. జిల్లాకు చెందిన ప్రముఖ వాస్తు,జ్యోతిష్య పురోహితులు రంగానాయకుల శ్రీధర్ ఆచారికి స్వామి వివేకానంద ఐకాన్ అవార్డు అందుకున్నారు.

# ఫిదా.. ఫిలిగ్రీ!

- కరీంనగర్ నుంచి ప్రపంచస్థాయి గుర్తింపు
- నాడు ప్రధానికి, నేడు వివిధ రాష్ట్రాల సీఎంలకు బహూకరణ
- గతంలో వెంకయ్యనాయుడు, ఇవాంక ట్రంప్‌కు అందజేత







విద్యానగర్(కరీంనగర్): ఆత్మీయులు అతిథిగా వస్తే మదిని దోచేలా బహుమతి ఇవ్వాలని అనుకుంటాం. దాన్ని చూసినప్పుడల్లా బహుమతి ఇచ్చినవారే గుర్తుకువచ్చేలా ఉండాలని కోరుకుంటాం. ఇందులో ప్రత్యేక గుర్తింపు పొందింది కరీంనగర్ ఫిలిగ్రీ. 400ఏళ్ల క్రితమే కరీంనగర్‌లో ఆవిర్భవించిన ఈ కళ జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కడార్ల పనయ్య అనేవ్యక్తి తొలిసారిగా కరీంనగర్‌లో ఫిలిగ్రీ కళ ద్వారా వెండి వస్తువులు తయారు చేసినట్లు సమాచారం. ఆయన తయారు చేసిన డ్రెస్సింగ్ సెట్‌ను నిజాం రాజు బ్రిటన్ రాణి ఎలిజబెత్‌కు బహుకరించినట్లు చరిత్ర చెబుతోంది. కాగా.. బుధవారం ఖమ్మంలో జరగనున్న బీఆర్‌ఎస్ సభలోనూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తదితర అతి థులకు కరీంనగర్ ఫిలిగ్రీ కళానైపుణ్యంతో తయారుచేసిన వెండి వీణలు బహుకరించనున్నారు.

**ప్రధానికి బహుకరణ**

మిషన్‌భగీరథ ప్రారంభోత్సవానికి రాష్ట్రానికి వచ్చిన ప్రధానిమోదీకి రాష్ట్ర ప్రభుత్వం 5కిలోల భారీ ఫిలిగ్రీ నెమలిని బహుకరించింది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికై మొదటిసారి హైదరా బాద్ వచ్చిన వెంకయ్యనాయుడికు 2.5కిలోల బరువుగల కాకతీయ కళాతోరణాన్ని కానుకగా ఇచ్చారు. రాష్ట్రంలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరైనా అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌కుమార్తె ఇవాంకకు అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా ఫిలిగ్రీ నెమలిని అందించారు.

**ఇలా తయారు చేస్తారు**

కావాల్సిన ఆకృతిని తయారు చేసేందుకు ముందుగా కొలతలు తీసుకుని డయాగ్రాం వేస్తారు. వెండితీగలను కావాల్సిన సైజుల్లో కత్తిరిస్తారు. కత్తిరించిన ముక్కలను ఫ్రేముల్లో అమర్చుతూ తుదిరూపం తీసుకొస్తారు. డయాగ్రాంలో కావాలిస్న ఆకృతిలో పేర్చిన వెండి తీగ ముక్కలను అతికిస్తారు. చిన్న వెండి ముక్కలు కావడంతో వాటిని పేర్చి క్రమంలో ఓపిక అన్నది చాల ముఖ్యమైనది. చిన్న ఆకృతి అయితే వారం నుంచి పది రోజులు పడుతుండగా.. పెద్ద ఆకృతి చేయడానికి నెల నుండి రెండు నెలల వరకు సమయం పడుతుంది.

**కళాకారుల పరిస్థితి ఇదీ..**

ఫిలిగ్రీ కళ ఉన్నా.. ఖరీదైనది కావడంతో ఈ రంగంలోని వారికి ఉపాధి కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో కేంద్ర హస్తకళల పోత్సాహకశాఖ ద్వారా ఎ.అశోక్ నేతృత్వంలో 2008లో కరీంనగర్‌లో సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ(సిఫ్కా) ఏర్పడింది. సొసైటి ద్వారా ప్రస్తుతం 15మంది పని చేస్తుండగా.. 100మంది వరకు ఇంట్లో నుంచి ఉపాధి పొందుతున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు.

### శిక్షణ.. ఉపాధి పొందుతున్నారు



28ఏళ్లుగా ఫిలిగ్రీ పనిచేస్తూ శిక్షణ ఇస్తున్నా. సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ కోశాధికారిగా, గ్రాండ్ మాస్టార్‌గా ఉన్నా. ఇప్పటివరకు 35మంది నా దగ్గర శిక్షణ పొందారు. ఫిలిగ్రీకళలో 2010లో రాష్ట్ర అవార్డు వచ్చింది. 2015లో జాతీయ అవార్డు తీసుకున్నా.

– ఆకోజు వెంకటేశ్వర్లు, కోశాధికారి, సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ

### ఆదరణ ఉంది



పదిహేను సంవత్సరాల నుంచి సిఫ్కా సొసైటీలో పనిచేస్తూ ఫిలిగ్రీ కళ ద్వారా ఉపాధి పొందుతున్నాను. మేము తయారు చేస్తున్న ఫిలిగ్రీ కళరూపాలకు మంచి ఆదరణ ఉంది. సంతోషంగా ఉంది.

– ఎర్రోజు గంగ జమున, ఫిలిగ్రీ కళాకారిణి